ప్రజాశక్తి

బుధవారం 30 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







సత్తా చాటిన గ్రీష్మ

శభాష్.. గ్రీష్మ

ఆసియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖకు చెందిన ప్రముఖ ఆర్టిస్టిక్ స్కేటర్ దొంతారా గ్రీష్మ ఆసియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటింది. విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థినిగా ఉన్న ఆమె దక్షిణ కొరియాలో ఈ నెల 21 నుంచి 29 వరకూ తలపెట్టిన 20వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో షో గ్రూప్ ఈవెంట్‌లో బంగారు పతకం గెలుచుకొని దేశ కీర్తిని నిలబెట్టింది. టీమ్ ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించిన గ్రీష్మ గాయంతో పోరాడుతూ ఫ్రీస్టైల్ సోలో ఈవెంట్‌లోనూ ఆరోస్థానంలో నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఈ విజయానికి కారణమైన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, విశాఖపట్నం జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రీష్మకు శిక్షణ ఇచ్చిన పి.సత్యనారాయణ, పి.చిట్టి బాబు, ఆదేశ్ సింగ్‌లకు, గ్రీష్మ క్రీడా ప్రస్థానాన్ని ఎల్లప్పుడూ ప్రోత్సహించిన విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



నగరంలోని ఐవిఎఫ్ సెంటర్‌లో తనిఖీలు చేపడుతున్న జగదీశ్వరరావు తదితరులు

ఐవిఎఫ్ సెంటర్లలో విస్తృత తనిఖీలు

'సృష్టి' ఉదంతంతో కదిలిన అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార : విశాఖ జిల్లాలోని ఒయాసిస్, పద్మశ్రీ ఐవిఎఫ్ సెంటర్లలోనూ, పిఎం.పాలెం ప్రాంతంలోని మరికొన్ని సరోగసీ సెంటర్లలోనూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ ఉమావతితో కూడిన బృందం మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. ఆయా సెంటర్ల అనుమతి పత్రాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఐవిఎఫ్ సెంటర్ల యాజమాన్యాలతో సోమవారం సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశామన్నారు. నియమ నిబంధనలు పాటించాల్సిందేనని చెప్పామన్నారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. గైనకాలజిస్టు, ఆండ్రాలజిస్టులు, ఎంబ్రియోలాజిస్టులు ప్రతి ఐవిఎఫ్ సెంటర్‌లో నిరంతం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం నగరంలోగల ఎఆర్‌టి బ్యాంక్ 1, 2లను పరిశీలించి తగు సూచనలు చేశారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖ కేంద్రాలుగా సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్ పలు అక్రమ పద్ధతులకు పాల్పడటం, కీలక నిందితులు ఇటీవల అరెస్టు కావడం నేపథ్యంలో అధికారులు విశాఖలో తనిఖీలను ముమ్మరం చేశారు.

జివిఎంసి స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు

21 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వచ్చే నెల 6న నిర్వహించే జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ 21 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది. అర్హత కలిగిన నామినేషన్ల జాబితాను వెంటనే వెల్లడిస్తారు. ఆగస్టు 2న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ఉంటాయని కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం తెలిపారు.

నామినేషన్లు దాఖలు చేసిన వారు వీరే..

నక్కెళ్ళ లక్ష్మి, సాడి పద్మావతి (పద్మా రెడ్డి), పల్లా అప్పలకొండ, జె.బిపిన్ కుమార్ జైన్, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, రెయ్యి వెంకటరమణ, కరజాడ వెంకట నాగ శశికళ, ఇమ్రాన్ మహమ్మద్, ఉరుకూటి రామచంద్రరావు, గనకల కవిత, మహమ్మద్ సాధిక్, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంతి, ముల్లి హేమలత, మాదంశెట్టి చిన్న తల్లి, గేదెల (బంటుబిల్లి) లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు, రౌతు శ్రీనివాసు, మొల్లి ముత్యాలు, కొణతాల నీలిమ నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు.

లూలూకు భూ కేటాయింపులు రద్దు చేయాలి

▶ వార్త 2లో..

రైవాడ నీరు విడుదల

▶ వార్త 8లో..

జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు

▶ వార్త 6లో..



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

విద్యుత్ సంస్కరణల్లో భాగమే స్మార్ట్ మీటర్లు

కార్మిక, ప్రజా సంఘాల వేదిక సదస్సులో ఎంవిఎస్.శర్మ

వార్త 5లో..

పదేళ్ల నుంచి రిక్రూట్‌మెంట్ లేదు

- విభాగాల్లో కాంట్రాక్టీకరణ నిజమే..
- చర్చల దశలో సింధుఘోష్ రీఫిట్ పనుల వ్యవహారం
- మీడియాతో హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి



మాట్లాడుతున్న హేమంత్ ఖత్రి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడిచిన పదేళ్లలో విశాఖపట్నం హిందుస్తాన్ షిప్‌యార్డులో పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ జరగలేదని, కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం పర్మినెంట్ కంటే అత్యధిక మందికి జాబ్స్ ఇవ్వాలనే విధానంతో కాంట్రాక్టీకరణకు ప్రాధాన్యమిస్తున్నామని హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమొడోర్ హేమంత్ ఖత్రి తెలిపారు. మంగళవారం విశాఖ షిప్‌యార్డులోని బోర్డు రూమ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ షిప్‌యార్డుకు నౌకల రీఫిట్, రిపేర్లకు సంబంధించిన ఆర్డర్లు ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నాయన్నారు. త్వరలో ఐఎన్ఎస్ సింధుఘోష్ నేవీ సబ్‌మెరైన్ రీఫిట్‌కు హెచ్‌ఎస్‌ఎల్‌కు రాబోతుందని, ఇంకా ఇది చర్చల దశలో ఉందని అన్నారు. భవిష్యత్తులో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల నిర్వహణతో యార్డుకు ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

విశాఖలో ఎంఎస్‌ఎంఇల అభివృద్ధిలో కీలకపాత్ర వహించాం

ఈ ప్రాంతంలో ఎంఎస్‌ఎంఇలను ఎంతగానో అభివృద్ధి చేశామని, షిప్‌యార్డులోని ప్రతి ఉద్యోగి, కార్మికుడు, సిబ్బంది ఎంతో కృషి చేశారని అన్నారు. నౌకల నిర్మాణ ప్రాజెక్టులు మేకిన్ ఇండియా పాలసీలో భాగంగా చేపడుతున్నామన్నారు. 80 శాతం వరకూ స్వదేశీ పరికరాలు, పరిజ్ఞానం షిప్‌యార్డు వినియోగిస్తోందన్నారు. ఐఎన్ఎస్ నిస్తార్‌లో 72 శాతం దేశీయ టెక్నాలజీయేనని ఉపయోగించామన్నారు. ఇటీవలే ఈ ఫ్లోటింగ్ డెక్‌ను నేవీకి అప్పగించినట్టు తెలిపారు. రూ.220 కోట్ల విలువగల 39 రకాల ఐటెమ్స్‌ను షిప్‌యార్డు దిగుమతి చేసుకుందన్నారు. దీనివల్ల స్థానిక ఎంఎస్‌ఎంఇల మార్కెట్ పురోగతి సాధ్యమైందన్నారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టీకరణపై ఆయన మాట్లాడుతూ... మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పదేళ్ల నుంచి రిక్రూట్‌మెంట్ లేదు

టెక్నాలజీ పెరుగుతున్నందున నైపుణ్యాలను పెంచుకుంటూ షిప్‌యార్డు ముందుకెళ్తోందని తెలిపారు. వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంలో భాగంగా కాంట్రాక్టీకరణ పెరిగిందన్నారు. ఎల్ అండ్ ఎం సిరీస్ స్టాఫ్ అండ్ వర్క్‌మెన్ పర్మినెంట్ వ్యవహారం షిప్‌యార్డుకు ఒక సవాల్‌గా ఉందని ఎలా పరిష్కరిస్తారని విలేకరులు ప్రశ్నించగా ఆ విషయం కోర్టులో ఉందని ఖత్రి అన్నారు. షిప్‌యార్డు 1100 మంది పర్సనల్, ఎంప్లాయీస్‌ను, అలాగే సుమారు 3100 కాంట్రాక్టు మ్యాన్‌పవర్‌ను కలిగి ఉందన్నారు. మొత్తంగా 4200 మంది ఈ ఏడాది జూలై 1 నాటికి షిప్‌యార్డులో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఫ్యాబ్రికేషన్, వెల్డింగ్, ఎరక్షన్ వంటి కీలక విభాగాల్లో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ పర్మినెంట్ ఉద్యోగుల బదిలీలు చేపట్టిన విషయంపై వివరణ కోరగా అంతా కేంద్ర ప్రభుత్వ విధానంతో చేపట్టామన్నారు. యార్డులో సుమారు 800 నుంచి 900 మంది విద్యార్థులకు వార్షిక టెక్నికల్ ట్రైనింగ్‌లు, ఇంటర్న్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. ఏటా 100 నుంచి 120 అప్రెంటిషిప్‌లను ఇస్తున్నామన్నారు. గీతం, ఐఐఎం యూనివర్శిటీలతో నైపుణ్యాలను ఇచ్చిపుచ్చుకుంటున్నామన్నారు. షిప్‌యార్డు ఫ్యాక్టరీ విస్తరణలో భాగంగా 25 ఎకరాల షిప్‌యార్డు కాలనీ భూమిని తీసుకోవడం జరిగిందని, మూలపేట, కాకినాడ పోర్టు ఏరియాలోనూ వందల ఎకరాల్లో భూమిని ప్రభుత్వం నుంచి షిప్‌యార్డు కోరుతోందని తెలిపారు. కార్యక్రమంలో షిప్‌యార్డు బోర్డు డైరెక్టర్లు జి.వెంకటేశ్వర్లు, గిరిదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా జెవి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సహకార రంగంలో విశాఖకు గుర్తింపు తీసుకొని వచ్చిన 110 సంవత్సరాల విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకుకు ఛైర్మన్, వైస్-ఛైర్మన్లుగా జెవి.సత్యనారాయణ మూర్తి, చలసాని రాఘవేంద్రరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేడు దేశంలో పనిచేస్తున్న 1472 సహకార అర్బన్ బ్యాంకులలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద అర్బన్ బ్యాంకుకాగా, దేశంలోని అర్బన్ బ్యాంకులలో ఆర్థిక కార్యకలాపాలరీత్యా మొదటి 10-15 స్థానాలలో నిలుస్తూ వస్తోంది. ఈ బ్యాంకుకు సంబంధించిన ఎన్నికకు జూన్ 16న ఈ ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీన్ని అనుసరించి సహకార శాఖ అధికారుల ద్వారా నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అన్ని కేటగిరీలకు సంబంధించి 21 మంది పోటీలో ఉన్నారు. వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈ నెల 25న ప్రకటించారు. ఛైర్మన్, వైస్-ఛైర్మన్ ఎన్నికను మంగళవారం నిర్వహించగా జెవి.సత్యనారాయణ మూర్తి ఛైర్మన్‌గానూ, చలసాని రాఘవేంద్రరావు వైస్-ఛైర్మన్‌గానూ డైరెక్టర్లు ప్రతిపాదించగా వారిరువురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని మాజీ ఛైర్మన్ మానం ఆంజనేయులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అభినందించారు. 2025-2030 మధ్యన బ్యాంకు డైరెక్టర్లుగా ఎన్నికైన 19 మందిలో సూర్యనేని నాగభూషణ చౌదరి, ఎజె.స్టాలిన్, వీరఘంట చంద్రశేఖర్, గుళ్లపల్లి జనార్దనరావు, చెరువు ఆదినారాయణ శాస్త్రి, కండాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీ దేవి, చిన్నం కోటేశ్వరరావు, సాల్యం నారాయణ స్వామి, చెలికాని కృష్ణమోహనరావు, ఆచాళ్ల రామకృష్ణారావు, ఈమని అవని, చుక్కపల్లి రామారావు, నన్నపనేని అంజయ్య, పులిగెడ్డ వెంకట నరసింహమూర్తి, జొన్నలగడ్డ ప్రసాద్, పిడికిటి మల్లికార్జునరావు, కోగంటి శ్రీకాంత్ బాబు, కేసరి నిర్మల ఉన్నారు.



జెవికి అభినందనలు తెలుపుతున్న మహిళ

1 నుండి నిరుద్యోగ యువతకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరిసీతారామరాజు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వి.ఎస్ పద్మనాభరాజు తెలిపారు. మంగళవారం శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖలో ఉద్యోగాలకు తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఆగస్టు 1 నుండి తరగతులు మొదలవుతాయన్నారు. 3 ఏళ్లగా శిక్షణ కొనసాగిస్తున్నామని, ఎందరో నిరుద్యోగులకు ఉపయోగపడిందని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9315014015 కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ప్రయోజనాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆయిల్ పామ్ సాగుతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. అనకాపల్లి జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కర్ రావు అధ్యక్షతన దేవరాపల్లిలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవాన్ని స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని, ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపాలని రైతులకు సూచించారు.

లూలూకు భూ కేటాయింపులు రద్దు చేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఆర్కె బీచ్ రోడ్డులో ఉన్న సుమారు రూ.వెయ్యి కోట్లు విలువ కలిగిన 13.74 ఎకరాల భూమిని అత్యంత కారు చౌకగా విదేశీ సంస్థ అయిన లూలూకు మాల్ నిర్మాణం కోసం ధారాదత్తం చేయడాన్ని ఖండిస్తున్నట్లు సిపిఎం విశాఖ కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేసిన ఈ కేటాయింపులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ప్రజల ప్రయోజనాలకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఈ భూ కేటాయింపులు జిఒ ఉందన్నారు. ఈ భూ కేటాయింపు రద్దయ్యే వరకు పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర సంఘాలు, కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్స్ రాష్ట్ర ప్రభుత్వ భూదందాను వ్యతిరేకించాలని కోరారు. లూలూ మాల్ భూకేటాయింపులకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలోని ఆర్‌కె బీచ్ రాష్ట్ర ప్రజల ఆహ్లాదానికి, వినోదానికి, పర్యాటకానికి అత్యంత ప్రాముఖ్య ప్రదేశమన్నారు. ప్రతిరోజూ లక్ష మందికిపైగా ప్రజలు సందర్శిస్తూ సముద్రాన్ని ఆస్వాదిస్తారన్నారు. ఇటువంటి ప్రాంతంలో ఖాళీగా ఉన్న భూములను ఓపెన్ స్పేస్‌గాను, పర్యాటకులు, పిల్లల వినోదానికి సైన్స్ మ్యూజియమ్‌గానూ ఏర్పాటు చేసి వినియోగించాలన్నారు. ప్రైవేట్ సంస్థ లాభాల కోసం ఈ భూమిని కేటాయించడం ప్రజల ప్రయోజనాలను దెబ్బదీయడమే అవుతుందని తెలిపారు. ఏకంగా 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడం ప్రజా భూమిని అప్పనంగా లూలూ సంస్థకు కేటాయించడమేనన్నారు. పైపెచ్చు ఈ భూమి కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వస్తుందన్నారు. ఈ పరిధిలో పర్మినెంట్ కట్టడాలు చేపట్టరాదన్నారు. బోర్డు వేయకూడదన్నారు. లూలూకు భూ కేటాయింపు వెనుక కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే అనుమానాలు వస్తున్నాయన్నారు. ఈ లూలూ మాల్ వల్ల విశాఖ ప్రజలకు ఏమాత్రమూ ప్రయోజనం ఉండదన్నారు.

ఆర్‌కె బీచ్, పాండురంగాపురం నివాస ప్రాంతం మొత్తం అత్యంత ట్రాఫిక్ రద్దీ ప్రాంతంగా మారి పర్యావరణం విధ్వంసం అవుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్వార్థ ప్రయోజనం కోసం విశాఖ ఆర్‌కె బీచ్ ప్రాంతాన్ని లూలూకు ధారాదత్తం చేసే అధికారం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి లేదన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలను జివిఎంసి 33వ వార్డులో మంగళవారం టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తిరుమలదేవి చక్రవర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వృద్ధులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర మెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి శ్రీనివాసు పాల్గొన్నారు.

గోపాలపట్నం : ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు కార్యాలయంలో ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కార్యకర్తలతో కలిసి గణబాబు కట్‌చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, శరగడం రాజశేఖర్, నాయకులు నారిపిన్ని సత్తిరాజు, పిఎసిఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, కంపర ఆనంద్ పాల్గొన్నారు.

ఆలయ భూమి శిస్తు వేలం వాయిదా

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో వెదురుపర్తి గ్రామంలో శ్రీవేణు గోపాల్ స్వామి ఆలయం భూమి శిస్తు వేలం పాటను వాయిదా వేశారు. ఆలయానికి చెందిన ఏడు ఎకరాలు 50 సెంట్లు భూమిని వెదురుపర్తికి చెందిన నలుగురు రైతులకు గతంలో భూ శిస్తుకు ఇచ్చారు. శిస్తు సమయం ముగియడంతో మంగళవారం వేలం పాట ఏర్పాటు చేయగా, పాత భూ శిస్తుదారులు, కొత్తవారు ఎవరూ రాకపోవడంతో వేలం వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు, అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13,14న పెందుర్తి బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సెప్టెంబరు 13, 14వ తేదీల్లో పెందుర్తి బాలోత్సవం పెందుర్తి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో జరుగుతుందని పెందుర్తి బాలోత్సవ కమిటీ తెలిపింది. పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ బాలోత్సవం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, విశాఖ బాలోత్సవం కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రోచర్‌ను విడుదల చేసారు. ఈ బాలోత్సవం ఎన్ఎడి కొత్తరోడ్ నుంచి అటు సింహాచలం, ఇటు నరవ, గోపాలపట్నం పెందుర్తి ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలన్నీ పాల్గొనవచ్చని బాలోత్సవ గౌరవాధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు. వివిధ అంశాల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు సెప్టెంబర్ 6వ తేదీన నిర్వాహకులకు అందజేయాలని 45 కల్చరల్, అకడమిక్ ఈవెంట్స్ జరుగుతాయని ఇందులో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలో పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కావున ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నీ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విద్యార్థులలో ఉన్న సాంస్కృతిక, అకడమిక్ ఆసక్తిని ప్రోత్సహించి పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు కె. శేషగిరిరావు, విసిసి వ్యవస్థాపకులు కె.రమాప్రభ, సతీష్, కళాశాల సిబ్బంది నాగమణి, బాలోత్సవ కమిటీ సభ్యులు ఎస్.వి.అప్పారావు, వి.నర్సింగరావు, శంకరరావు, జె.మహేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రులు కిటకిట



- వాతావరణంలో మార్పులతో సోకుతున్న విష జ్వరాలు..

- ఇంట్లో ఒకరికి వస్తే కుటుంబ సభ్యులందరికీ వ్యాప్తి

ప్రజాశక్తి - భీమునిపట్నం

విషజ్వరాల బారిన పడి చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి (సిహెచ్‌సి) సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు సుమారు 300 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇందులో దాదాపు 60 మంది వరకు విషజ్వరాలతో ఉన్న వారేనని వైద్యులు చెబుతున్నారు. ఇందులో 15 నుంచి 20 మంది వరకు ఆసుపత్రిలో ఉండి (ఇన్ పేషెంట్లు) చికిత్స పొందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోజుకు సుమారు 40 మంది అవుట్ పేషెంట్లు వస్తుండగా ఇందులో దాదాపు 25 మంది, చేపలుప్పాడ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజుకు వస్తున్న సుమారు 60 మంది అవుట్ పేషెంట్లలో దాదాపు సగం మంది, తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజుకు వస్తున్న సుమారు 90 మంది అవుట్ పేషెంట్లలో 60 మంది, భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు వస్తున్న సుమారు 50 మంది అవుట్ పేషెంట్లలో దాదాపు 30 మంది వరకు విషజ్వరాలతో బాధపడుతూ వస్తున్నవారేనని సంబంధిత వైద్యులు చెబుతున్నారు.

వర్షాలతో పాటు గానే వెంట వస్తున్న జ్వరాలు..

వాతావరణంలో వస్తున్న మార్పులకు తోడు రోజు విడిచి రోజు కురుస్తున్న వర్షాలతో విషజ్వరాలు సోకుతుండడంతో ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిట లాడుతున్నాయి. జలుబు, దగ్గు, తల నొప్పి, కడుపులో నొప్పి, కళ్లు తిరిగి పడి పోవడం, అలసట రావడం, ప్లేట్ లెట్లు తగ్గుదల తదితర బాధలతో ఈ మధ్య కాలంలో ఆసుపత్రులకు నిత్యం వస్తున్నారు. మూత్రం, మలం, ముక్కు ద్వారా రక్తం కారడం లాంటి బాధలతో ఇంకొందరు వస్తున్నారు. పేద ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతుండగా అంతో ఇంతో ఆర్థిక స్తోమత ఉన్న వారు దగ్గర్లో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులకు, నర్సింగ్ హోమ్‌లకు, క్లినిక్‌లకు వెళ్తున్నారు.



వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

జాగ్రత్తలు తీసుకోవాలి

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో సాధారణంగా జ్వరాలు వస్తుంటాయి. ఆందోళన చెందనక్కర లేదు. జ్వరాలు వచ్చాక జాగ్రత్తలు తీసుకోవాలి. కళ్లు తిరిగి పడిపోయినా, కడుపులో నొప్పి వచ్చినా సరే వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించాలి. తరచూ కాచి వడబోసిన నీరు తాగాలి. భోజనానికి ముందు చేతులు శుభ్ర పరుచుకోవాలి. ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న కొబ్బరి బొండాలు, టైర్లలో, నీరు నిల్వ ఉన్న చోట సాధారణంగా దోమలు వృద్ధి చెందుతాయి. దోమ కాటు వల్ల జ్వరాలు వస్తాయి. అలానే డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. వారంలో ప్రతి శుక్రవారమూ "ఫ్రైడే, డ్రై డే" కార్యక్రమంలో భాగంగా ఇళ్లలోని ఫ్రిజ్‌లు, నీరు ఉంచే కుండీలు, డ్రమ్ములు శుభ్ర పరుచుకోవాలి. ఆరుబయట తినుబండారాలు, పకోడీ, బజ్జీలు లాంటి వేపుడు పదార్థాలు తినకూడదు. సాధారణంగా ప్లేట్‌లెట్లు ప్రతి ఒక్కరిలో 2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఉంటాయి. వీటిని తగ్గకుండా చూసుకోవాలి. భీమిలిలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు కూడా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు ఇక్కడ ఉన్నాయి.



డాక్టర్ ఎ.కల్యాణ్ శ్రీనివాస్
వైద్యులు
సామాజిక ఆరోగ్య కేంద్రం
భీమిలి.

తీరం కోతకు గురికాకుండా చర్యలు

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్



కోతకు గురవుతున్న తీరాన్ని పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : సముద్ర తీర ప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ వై.కృష్ణారావుతో కలిసి మంగళవారం ఆయన కోతకు గురవుతున్న భీమిలి తీర ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక నోవా హోటల్ సమీపంలో ఉన్న పోలమాంబ ఆలయం నుండి జోనల్ కార్యాలయం వరకు ఉన్న తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన పటిష్ట రక్షణ గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతం సిఆర్‌జెడ్ జోన్‌లో ఉన్నందున ప్రభుత్వ అనుమతి కోరుతూ ముందుగా లేఖ పంపాలని సూచించారు. బీచ్ రోడ్డు ఆర్ అండ్ బికి సంబంధించినందున ప్రస్తుతం ఉన్న రోడ్డు, ప్రతిపాదిత రోడ్డు విస్తరణకు సంబంధించి ఆర్ అండ్ బి శాఖను సంప్రదించాలని సూచించారు. 'అర్బన్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం' నిధులతో 1.9 కిలోమీటర్ల మేరకు పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణానికి ప్రత్యేక ప్రాజెక్ట్‌గా పరిగణించాలని జెడ్‌సిని ఆదేశించారు. స్థానిక పార్కు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జివిఎంసి కమిషనర్ వెంట ఇఇ వెంకటేష్, అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్ పాల్గొన్నారు.



ఇవిఎం గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్శనలో గ్రామీణ తహశీల్దార్ పాల్ కిరణ్, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. పిబి ఖాన్ నిర్వహణలో నగరానికి చెందిన ప్రముఖ గాయకులు పెమ్మరాజు రామ్, ఎమ్.శ్రీనివాసరావు, కెఎల్.రావు, రామనర్సింహం, సుబ్బారావు, ఖాన్ గాయని మణులు రంజిత, మాధురి, అంబిక, గంటి ఉష, ఎస్.రాజేశ్వరి యుగళగీతాలను ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా వక్తలు కట్ట మల్లేశ్వరరావు, సన్ మూర్తి మాట్లాడుతూ గాయనిగా సత్యవతి ఖాన్ తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. అనంతరం సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ గాయని సత్యవతి ఖాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకుల సంఘం అధ్యక్షులు భయ్యా శ్రీనివాస్, లక్ష్మీ స్వరూప పాల్గొన్నారు.

జూ పార్కులో ఘనంగా గ్లోబల్ టైగర్ డే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో మంగళవారం గ్లోబల్ టైగర్ డేను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పులులు సంరక్షణ, పర్యావరణలో వాటి కీలక పాత్రపై విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలు, డాక్యుమెంటరీ ప్రదర్శనలో వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలు పర్యావరణ ప్రాముఖ్యతను, పులుల జీవావాసాలను సంరక్షించే అవసరాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో జీవరాసుల పాత్ర, పులులను సంరక్షించడంలో మన పాత్ర తదితర విషయాలపె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహన మిత్ర అమలుచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు స్థానికంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యాన స్థానిక జిఆర్ భవన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పాత ఆంధ్రా బ్యాంక్ మీదుగా జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ, ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదల తో ఆటో కార్మికుల జీవనం కష్టంగా మారుతుందన్నారు. ఆటో కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కొండపు ఈశ్వరరావు, ఎస్.సీతారాములు, వై.అప్పలనరసయ్య, ఎన్.మధురెడ్డి, కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, ఎల్.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ సిసిడి విభాగంలో క్లీనింగ్ పనులు చేస్తున్న పుచ్చల రామారావు (49) విధులు నిర్వహిస్తూ మృతి చెందారు. తోటి కార్మికుల కథనం ప్రకారం... విధుల్లో ఉండగా అకస్మాత్తుగా వాంతులు రావడంతో మెయిన్ గేట్ వద్ద ఫస్ట్ ఎయిడ్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ వద్ద మృతదేహాన్ని ఉంచారు. వెంకట దుర్గా ఇంజినీరింగ్ వర్క్స్‌లో పనిచేస్తున్న కార్మికుడు చనిపోతే యజమాని సన్యాసినాయుడు కనీసం పరామర్శించడానికి కూడా రాకపోవడం దుర్మార్గమని కార్మిక నేతలు అంటున్నారు. మృతుని కుటుంబాన్ని కాంట్రాక్టర్ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతునికి ఇద్దరు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. జివిఎంసి 73వ వార్డు పరిధి అంబేద్కర్ నగర్‌లో కుటుంబంతో సహా నివాసముంటున్నారు. భార్య ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

24 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో సారిపల్లిపాలెం జాతీయ రహదారిపై అక్రమంగా బైక్ పై తరలిస్తున్న 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎస్ఐ సన్నిబాబుకు వచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుండి తుని వైపు బైక్ పై రెండు బ్యాగులలో గంజాయి ప్యాకెట్లను తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. చింతపల్లి మండలం, మామిడిపాలెం గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ సుక్రీ అర్జున్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు. సుక్రీ అర్జున్ తన స్నేహితుడు కొదమ నాగరాజు కలిసి గంజాయి వ్యాపారం చేస్తుంటారని వెల్లడించారు. రెడ్డి నరసింహమూర్తి అను అతను గంజాయి కావాలని సుగ్రీ అర్జున్‌కు ఫోన్ చేయగా, రైతుల వద్ద కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో చాలాసార్లు ఒరిస్సా లోని కోరాపుట్ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి నరసింహమూర్తికి అప్పగించారని తెలియజేశారు. ఈ మేరకు అర్జున్‌ను అరెస్టు చేసి, బైకు ఫోన్ స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కుమారస్వామి, ట్రెయినీ ఎస్ఐ సాహిబ అంజుమ్, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం జంక్షన్ సమీప మలుపు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలో చోద్యం గ్రామానికి చెందిన పైల ప్రభాకర్(33) నర్సీపట్నం నుండి సోమవారం రాత్రి చోద్యం గ్రామంకు వస్తుండగా మార్గ మధ్యంలో పప్పుశెట్టిపాలెం జంక్షన్ సమీపంలో మలుపు వద్ద కుక్క అడ్డుగా రావడంతో ప్రభాకర్ ప్రయాణిస్తున్న బైకు అదుపు తప్పి రోడ్డుపైన పడిపోయాడు. దీంతో తల భాగం, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తుల సహకారంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.. గాయాలు తీవ్రంగా ఉండటంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా అంబులెన్స్‌లో బయలుదేరే సమయంలోనే ప్రభాకర్ మృతి చెందాడు. ఎస్సై పి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారవేత్తలను తయారుచేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-ఆనందపురం : ప్రతి కుటుంబం నుంచీ ఒక్కో వ్యాపారవేత్తను తయారుచేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ కె.సింహాచలం నాయుడు తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జులై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరుగుతున్న సురక్ష బీమా క్యాంపెయిన్‌లో భాగంగా యూనియన్ బ్యాంక్, ఆనందపురం శాఖ ఆధ్వర్యాన గ్రామ పంచాయతీలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. సైబర్ మోసాల నుండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధాన మంత్రి జీవిత బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలలో ప్రతి ఒక్కరూ చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన మీసాల సూర్యనారాయణ, పీతల శ్రీను కుటుంబ సభ్యులకు చెరో రూ.2 లక్షల బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ తిరుపతిరావు, నాయకులు శ్రీనాథ్ నారాయణరావు, చందక సూరిబాబు, కొట్టియాడా రెడ్డిబాబు, దొంతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : మానవ అక్రమ రవాణా నిరోధించడంలో స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని విశాఖ న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం సెయింట్ ఆంథోనీ పాఠశాలలో మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పేద సాదా బీద బిక్కి అంతరాలు లేకుండా సామాన్యులే మానవ అక్రమ రవాణాకు బాధితులుగా నిలుస్తున్నట్లు చెప్పారు. పేదరికం మనిషిని ఏ స్థాయి నుంచైనా దిగజారుస్తుందని చెబుతూ అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి ప్రతి సేవా సంస్థ ముందడుగు వేయాలన్నారు. ప్రతి సేవా సంస్థ ప్రతినిధులు న్యాయవిజ్ఞానాన్ని తెలుసుకుంటే ప్రజలకు అనేక విధాలుగా సేవలు అందించవచ్చన్నారు. ప్రతి సమస్యకు న్యాయ సేవ ప్రాధికార సంస్థ పరిష్కారం దిశగా న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, ప్రిన్సిపల్ న్యాయవాదులు, సమాంతర న్యాయ సేవ సహాయకులు, లోక్ అదాలత్ న్యాయవాదులు సమాంతర న్యాయ సేవ సహాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ, కూటమి నాయకులు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి, నేడు అమలుచేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జాన్ వెస్లీ పాల్గొన్నారు.

మునగపాక : కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో మంగళవారం 'బాబు షూరిటీ మోసం గ్యారెటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మాట తప్పిందని మండిపడ్డారు. హామీలపై నిలదీసిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు యువి.రమణమూర్తి రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఆడారి త్రిమూర్తులు, కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, కాండ్రేగుల జగన్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్ కౌంటర్లు ప్రారంభం



ఎగ్ కార్ట్‌లను అందిస్తున్న పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రంలో నేషనల్ ఎగ్ కౌన్సిల్ ఆర్థిక సహాయంతో మహిళలకు ఉపాధి కోసం అందజేసిన ఎగ్ కార్ట్ కౌంటర్లను మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నాయన్నారు. మహిళలు స్వయంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ సత్యంనాయుడు, ఎంపిడిఒ అప్పలరాజు, ఇఒపిఆర్‌డి కామేశ్వరరావు, ఎపిఎం పద్మావతి, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, పద్మ, విఒఎలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంటా కాలనీలో బెహరా పర్యటన

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు ఎఇ వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. కాలనీలోని కాలువలు, రహదారి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన భాస్కరరావు సత్వరం ప్రతిపాదనలు తయారుచేయాలని ఎఇని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు షేక్ వలి, రావర్తి అప్పారావు, ఇవి.రమణ, గొడ్డు నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



బంటాకాలనీలో పర్యటిస్తున్న బెహరా భాస్కరరావు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : యుటిఎఫ్

ప్రజాశక్తి -ములగాడ : పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకోగలమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన ములగాడ శాఖ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహతో ఉపాధ్యాయ సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసే సంఘం యుటిఎఫ్ అని తెలిపారు. యుటిఎఫ్‌లో వ్యక్తిగత అంశాలు ఉండవన్నారు. సమిష్టి నిర్ణయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఐక్యంగా సంఘాన్ని అభివృద్ధి చేసుకుంటూ, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో అందరి ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందన్నారు. అందుకే యుటిఎఫ్ పట్ల ఆదరణ ఉందని, ఉపాధ్యాయులు ఆకర్షితమవుతున్నారని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



యుటిఎఫ్‌లో చేరిన ఉపాధ్యాయులకు కండువా వేసి ఆహ్వానిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో ములగాడ మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్ఎన్.భాషా, అధ్యక్షులుగా వి.కన్నబాబు, సహాధ్యక్షులుగా పి.కృష్ణకిషోర్, సహాధ్యక్షులుగా ఎం.విక్టోరియారాణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్ఎన్‌వి.సత్యనారాయణ, కోశాధికారిగా జె.గణేశ్వరరావు, కార్యదర్శులుగా ఎన్.మూర్తి, కె.సత్యనారాయణ, బి.సాయికుమార్, రాయి లోవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యుటిఎఫ్‌లో పలువురు చేరిక

యుటిఎఫ్ నిబద్ధత పట్ల ఆకర్షితులై పలువురు ఉపాధ్యాయులు ఈ సంఘంలో చేరారు. వి.కన్నబాబు, జె.గణేశ్వరరావు, ఆర్ఎన్‌వి.సత్యనారాయణ, బి.సాయికుమార్, రాయి లోవరాజు, ఎన్.మూర్తి, కె.సత్యనారాయణ, శివరామకృష్ణ యుటిఎఫ్‌లో చేరారు. వారికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ సంఘాల్లో నిజాయితీగా, నిరంతరం ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయులను చైతన్యం చేసి, సమస్యల పరిష్కారంలో దిక్సూచిగా వ్యవహరిస్తున్న సంఘం యుటిఎఫ్ అన్నారు. అటువంటి సంఘంలో చేరడం గర్వకారణంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు రిజ్వాన్, రియాజ్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎ.విజయకుమారి, పెదగంట్యాడ మండల శాఖ అధ్యక్షులు రాజిక్, ములగాడ మండల బాధ్యులు సతీష్, గోపాలపట్నం బాధ్యులు రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్లో ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్



ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ప్రారంభంలో మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -ఉక్కునగరం : దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో నెంబర్ ప్లాట్‌ఫారం వైపు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను మంగళవారం విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, డిఆర్ఎం లలిత్ బోహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైల్వే ప్రయాణికులకు సుఖమైన, సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్‌టిఏ నిబంధనల ఆధారంగా ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. దువ్వాడ స్టేషన్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. రిజిస్టర్ చేసుకున్న ఆటోలకు జిపిఎస్ ఏర్పాటుచేయడంతో పాటు డ్రైవర్లకు గుర్తింపు కార్డులు కూడా అందజేసినట్లు తెలిపారు. ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చని, ఇతర పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లు స్టాండ్ వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కొన్ని కంపెనీల ప్రతినిధుల సహకారంతో జిపిఎస్, సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేషన్ మరింత అభివృద్ధి చెందనుందని, ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయని డిఆర్ఎం లలిత్‌బోహ్రా తెలిపారు.

పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అంకితం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కేంద్ర విద్యా శాఖ మంత్రివర్యులు ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్ పద్ధతిలో దేశానికి అంకితం చేసే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పిఎం శ్రీ పథకం కింద పెందుర్తి పాఠశాల ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు బాగా చదివి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, సమగ్ర శిక్షణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, డిఇఒ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సోమేశ్వరరావు, ఎంఇఒ లక్ష్మి, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సువర్ణ, మధుమూర్తి, పెందుర్తి పిఎం శ్రీ ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సిహెచ్ చిన్మయ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : మహాత్మ మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షులు జాగరపు శ్రీను ఆధ్వర్యాన నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాకలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పెదగంట్యాడ శ్రీ దుర్గా శ్రీనివాస ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ దగ్గర ఆగస్టు 1వ తేదీన నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీను, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఫౌండర్ వినోద్ బాలు, సనపల డిల్లీశ్వరరావు, గంధం సాయి, పవన్ సుధమల్ల, కర్లం బాబూరావు, కోటి, రవీంద్ర, నవీన్, రాము, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ తాగితే జరిమానా

ప్రజాశక్తి-గోపాలపట్నం : బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్టు తాగితే పోలీసులు పట్టుకొని రూ.200 జరిమానా విధిస్తున్నారు. జివిఎంసి 92వ వార్డు పరిధి సింహాచలం రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిలో పాన్‌షాపుల వద్ద యువత, సిగరెట్టు కాల్చే అలవాటు ఉన్నవారు వచ్చి కాల్చటం ప్రారంభించగానే పోలీసులు ప్రత్యక్షమై జరిమానా విధిస్తున్నారు. జరిమానా చెల్లించలేక పలువురు లబోదిబో మంటున్నారు. సిగరెట్ కాల్చేవారిపై కన్నా గంజాయి, మద్యం తాగేవారిపై పోలీసులు దృష్టి పెడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్య కల్యాణంలో భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

ఎంఎంటిజెడ్‌ను సందర్శించిన ఆదర్శ్ విద్యార్థులు

ప్రజాశక్తి-పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్‌ను సందర్శించారని ప్రిన్సిపల్ ఎస్ఇ.ఫ్లోరా తెలిపారు. ఇండస్ట్రీ విజిట్‌లో భాగంగా ఎఎంటిజెడ్ కో-ఆర్డినేటర్ బాల త్రిపుర సుందరి పర్యవేక్షణలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ లింబ్స్, ఇండియన్ బయోమెడికల్ కన్సార్టియం సెంటర్ ఫర్ గ్రామ ఇరిడియేషన్, బయో వాలీ, 3డి ఆర్గాన్స్ ప్రింటింగ్, అడ్వాన్స్ మెడికల్ టెక్నాలజీ, గ్లూ మీటర్స్, సిఎంసి మిషిన్, మిషిన్ టెక్నాలజీ వివరించారు. విద్యార్థులు వారి ప్రాజెక్ట్ వర్క్స్‌లో బీకాం థర్డ్ ఇయర్, బిబిఎ థర్డ్ ఇయర్, బిబిఎ సెకండ్ ఇయర్ , బిఎస్‌సి సెకండ్ ఇయర్, బీకాం సెకండ్ ఇయర్, విద్యార్థులు 46 మంది హిస్టరీ లెక్చరర్ డి.సింహాచలం, మేనేజ్‌మెంట్ లెక్చరర్ బిఆర్‌జి.పరిమళ ఆధ్వర్యంలో సందర్శనలో పాల్గొన్నారు. వీరిని ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అభినందించారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి తోటవీధిలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు సిహెచ్.రమణ, కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల్లో భాగమే స్మార్ట్ మీటర్లు

- ప్రజలంతా వాటిని తిప్పికొట్టాలి
- కార్మిక, ప్రజా సంఘాల వేదిక సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే అదానీ స్మార్ట్ మీటర్లు వచ్చాయని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ప్రజలపై భారాలు వేసే అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, అదనపు ఛార్జీలను రద్దు చేయాలంటూ కార్మిక, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. దీనిలో శర్మ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల పేరుతో విభజించిందన్నారు. ఇప్పుడు మళ్లీ తిరిగి విద్యుత్ సంస్థలను మొత్తం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. అందులో భాగంగానే స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకు వచ్చిందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే వాటిని బద్దలు కొట్టండి అని స్వయానా నేటి మంత్రిగా ఉన్న లోకేష్ చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో శరవేగంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. ఆగస్టు 5న ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా జరుగనుందని, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా నాయకులు ఎస్‌కె.రెహమాన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను వివరించారు. పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగానే విద్యుత్‌ను అదానీకి కట్టబెడుతున్నారన్నారు. ఆర్‌కెఎస్‌వి. కుమార్ మాట్లాడుతూ దేశంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు వీరిద్దరూ అదానీ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారన్నారు. సదస్సులో ప్రజా సంఘాల నాయకులు ఎం.మన్మథరావు, కె.దేవా, తిరుపతిరావు, బేగం, ఎస్.గౌరి, ప్రకాశరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, నాయన బాబు పాల్గొన్నారు. నాటి విద్యుత్ పోరాట స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నేడు ఉద్యమానికి సిద్ధమవుతామని ఈ సదస్సు తీర్మానించింది.



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ, వేదికపై కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

మహిళల నిరసన

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అంగీకరించేది లేదని మహిళలు కృష్ణా గార్డెన్స్‌లో నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ముద్రించిన స్టిక్కర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు, గణేష్ పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

చోడవరం : విద్యుత్ వినియోగదారులందరూ అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్వి నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకన్నపాలెంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ గోడ పోస్టర్లు అతికించారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టమనిలోకేష్ పాదయాత్రలో చెప్పారని, నేడు వారే ఈ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కరెంటు చార్జీలు పెరిగాయని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరింతగా భారాలు పడతాయని తెలిపారు.

అచ్యుతాపురం : అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ బిల్లులు మూడు రెట్లు వరకు వినియోగదారులపై భారం పడుతుందన్నారు. ఈ మీటర్లు బిగించడానికి ఎవరైనా వచ్చినట్లయితే తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు సరగడం రామనాయుడు, నడుపూరు సన్యాసిరావు, భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరవాడ : స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ సంతలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల నుంచీ మొదలుపెట్టి, షాపులు, సంస్థలు, వ్యవసాయ పంప్ సెట్ల వరకు ఈ మీటర్లు బిగించారని, త్వరలో ప్రతి ఇంటికీ బిగించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. వాటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ, మండపాక గోపాల్ రావు, లక్ష్మీ, రమణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు



తిమ్మరాజుపేటలో మహిళలతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు



సంతలో మహిళలతో మాట్లాడుతున్న మాణిక్యం



మాట్లాడుతున్న ఎంపిపి వెంకట పద్మలక్ష్మి

అధికారుల తీరుపై ఎంపిటిసిలు అసహనం

ప్రజాశక్తి-పరవాడ : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఎత్తిచూపిన సమస్యలపై అధికారుల సమాధానాలు చెప్పకపోవడంపై పలువురు సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించిన ఎంపీపీ పద్మలక్ష్మి మాట్లాడుతూ, అభివృద్ధి పనులపై అధికారులు వేగంగా స్పందించాలని కోరారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, నీటి సరఫరా, గృహ నిర్మాణం తదితర శాఖలపై ప్రస్తుత పరిస్థితుల గురించి ఆమె ఆరా తీశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సమావేశంలో ప్రతి ఎంపీటీసీకి రూ.10 లక్షల నిధులతో అభివద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదనలు ఇచ్చినా, ఇప్పటివరకు అధికారుల నుండి ప్రొసీడింగ్‌లు రాకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల పరవాడలో కల్తీ మద్యం ఘటనపై ఎక్సైజ్ శాఖ తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ అంశంపై అధికారులు సమాధానం ఇవ్వలేక తడబడ్డారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్ నాయుడు, ఎంఆర్ఓ నాగరాజు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కశింకోట : బాలల సంరక్షణ అందర బాధ్యత అని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. అనకాపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కసింకోట పంచాయతీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిస్కార వేదిక కోసం అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో 11 మంది సభ్యులతో కూడిన గ్రామస్థాయి బాలల సంక్షేమ రక్షణ కమిటీని ఏర్పాటు చేసి దాని ద్వారా పిల్లల సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రభావతి, సర్పంచ్ ఎం.రజనీ, కసింకోట వైద్య అధికారి డాక్టర్ తిరుపతిరావు, వైస్ ఎంపీపీ జ్యోతి, ఏఎస్ఐ కె.రమణమ్మ, హైస్కూల్ హెచ్ఎం ఎన్.రమణ, జిల్లా బాలల రక్షణ అధికారి కేఎల్ మనోహరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ జాన్సీ, ఆదిలక్ష్మి, వంశీ ప్రియా, అంగన్వాడి వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శివాలయానికి నాగాభరణం వితరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోన శివాలయానికి నడిపల్లి రామరాజు దంపతులు నాగాభరణం వితరణగా అందజేశారు. వారికి శివాలయం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, దంగేటి నాని, గొర్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో మోదకొండమ్మ ఆలయం నిర్మాణానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ రూ.50వేలు విరాళం మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, నాయకులు విల్లూరి నరసింగరావు, దాడి శివ, పెంటకోట శ్రీరామ్మూర్తి, సూరిసెట్టి అప్పలనాయుడు కమిటీ సభ్యులు జంపా శ్రీను, బీరా శ్రీను, బీరా ఈశ్వరరావు, ఇంటి శ్రీను, బీరా నాగేశ్వరరావు, బీరా వాసు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న టిడిపి నేత సాయికృష్ణ

లారీని ఢీకొన్న బస్సు : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ఉన్న ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు బాపట్ల నుండి విజయనగరం బయలుదేరింది. మంగళవారం ఉదయం 6 గంటలకు బయ్యవరం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 16 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ షేక్ ఖాసిం తీవ్రంగా గాయపడగా, ఎన్టీఆర్ హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. మరో డ్రైవర్ డి.సుధాకర్ రెడ్డి అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం తన తోటి డ్రైవర్‌కు తోడుగా విశాఖ కెజిహెచ్‌కు వెళ్లారు. గాయాల పాలైన ప్రయాణికులు అమ్మిరెడ్డి, చౌడేశ్వరరావు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలోని చికిత్స పొందుతున్నాడు. మిగిలిన వారు ప్రథమ చికిత్స అనంతరం వెళ్లిపోయారు. కశింకోట ఎస్సై లక్ష్మణరావు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అన్నారు. మంగళవారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆమె ఆసుపత్రి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమం వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీను, సర్పంచ్ జయ రజని, పిహెచ్‌సి వైద్య అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆర్‌ఇసిఎస్ పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్

మిగిలిన సీట్లుకు 2లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలోని ఆర్‌ఇసిఎస్ పిల్లల కొరకు రాజీవ్ గాంధీ ఆర్‌ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కేటాయించిన 50 శాతం అడ్మిషన్లు మంగళవారం జరిగింది. ప్రత్యేక కౌన్సెలింగ్‌ను అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు, జనరల్ సెక్షన్ విభాగాధిపతి కె గోవింద రావు, కెమిస్ట్రీ సీనియర్ లెక్చరర్ శ్రీనివాసరావు అడ్మిషన్ అధికారులుగా వ్యవహరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగంలో 30 చొప్పున, మెకానికల్‌లో 23 సీట్లు, సివిల్ విభాగంలో 10 సీట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్ మాట్లాడుతూ మెకానికల్ విభాగంలో 7 సీట్లు, సివిల్ విభాగంలో 20 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, జెనరల్ సెక్షన్ విభాగాధిపతి గణేష్, ఆఫీసు సూపరింటెండెంట్ కె శివరామ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మనోజ్ కుమార్, ఎఎస్ఐ రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక శోషణను గుర్తించే విధానం, సురక్షితంగా ఉండే మార్గాలు, ఎవరైనా అసౌకర్యంగా తగిలితే ఎలా స్పందించాలో, తల్లిదండ్రులు లేదా పోలీసులతో ఎలా మాట్లాడాలో వివరించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రెడ్డి జగన్మోహన్

సమాజాభివృద్ధికి పాత్రికేయులు కృషి చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

సమాజాభివృద్ధికి పాత్రికేయుల కృషి ఎంతో అవసరమని స్థానిక ఎంపిపి రెడ్డి జగన్మోహన్ అన్నారు. మంగళవారం కె కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో ఏపీయూడబ్ల్యూజే చోడవరం ప్రెస్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డివియం నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి కత్తి మీద సాములాంటి దన్నారు. పాత్రికేయుల సంక్షేమ నిధికి రూ.25వేలు విరాళంగా ఇస్తానని తెలిపారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ మాట్లాడుతూ పాత్రికేయులు సమాజంలో జరిగే మంచి చెడులను గుర్తించి వార్తలు అందించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి బిఎల్ఎన్ స్వామి మాట్లాడుతూ సంఘ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్వామిని స్థానిక నాయకులు, అధికారులు, పాత్రికేయులు ఘనంగా సత్కరించారు. తహశీల్దార్ భుజంగరావు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, ఏ కోడూరు, కె కోటపాడు ఎస్ఐలు లక్ష్మీనారాయణ, ధనుంజయ్, ఏపీడబ్ల్యూజే నాయకులు జోగినాయుడు కోరాడ చంద్రరావు చోడవరం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు నేమాల సత్యనారాయణ, కుబిరెడ్డి రాధాకృష్ణ, శిల్పరిశెట్టి వెంకటరావు, గజ్జి గంగాధర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో చోడవరం, కె కోటపాడు, దేవరపల్లి మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో విద్యార్థి నాయకుల ఎన్నిక

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యా నాయకుల ఎన్నిక ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు ఆధ్వర్యాన మంగళవారం జరిగింది. బ్యాలెట్ రూపంలో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రథమ నాయకునిగా పులిగా రాజ్యలక్ష్మి, రెండు లీడర్‌గా రెడ్డి యశ్వంత్ ఎన్నికయ్యారు. వీరిని హైస్కూల్ చైర్మన్ కరణం శ్రీను అభినందించారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కసింకోట -బంగారుమెట్ట రోడ్‌లో బుచ్చయ్యపేట పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుచ్చియ్యపేట ఎస్ఐ, శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి-వడ్డాది

రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువుల కోసం రైతులు ఎగబడుతున్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం రైతులు ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. యూరియా, డిఏపి ఎరువులను రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వ సబ్సిడీపై విక్రయిస్తున్నారు. ఇప్పటికే వేసిన వరి ఆకుమలు అన్ని ఎదిగి ఉండడంతో దమ్ములు పెట్టి రైతులు సిద్ధంగా ఉన్నారు. దమ్ములోనే యూరియా వేయడానికి రైతులు రైతుసేవ కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. యూరియా రూ.270 కాగా డీఏపీ రూ.1360కు రైతులకు అందిస్తున్నారు. సుమారు 517 బస్తాలు యూరియా అందుబాటులో ఉన్నట్లు అగ్రికల్చర్ అధికారి శ్రీసాయి లక్ష్మి తెలిపారు.


ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు

-పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించాలి
-జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయుటకు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపీసీ) 15వ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పికెపి ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏక గవాక్ష విధానం కింద గత మే 26న జరిగిన సమావేశం నుండి ఇప్పటివరకు 685 దరఖాస్తులు వివిధ శాఖల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో 615 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల అనుమతులు వివరాలను వివిధ శాఖల అధికారుల తో మాట్లాడి నిర్ణీత సమయంలో ఆమోదించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో 14 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కొరకు 37 దరఖాస్తులకు గాను 5.92 కోట్ల రూపాయలకు కమిటీలో ఆమోదం తెలిపామన్నారు. జిల్లాలో 43 భారీ పరిశ్రమలు స్థాపనకై ప్రతిపాదనలు వివిధ దశలలో ఉన్నాయని, వీటి ద్వారా 2,81,760 కోట్ల పెట్టుబడి, 1,46,673 మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సురక్షిత తనిఖీ-ప్రమాదకర, హానికర పరిశ్రమల తనిఖీలపై సమీక్షా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పికెపి ప్రసాద్, ఎ.పి.ఐ.ఐ.సి. జెడ్.ఎమ్. నరసింహారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇ.ఇ. ముకుంద రావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఇతర కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఉల్లాస్ అక్షరాంధ్ర" అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అక్షర ఆంధ్ర సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ శాఖ ద్వారా 2023 సంవత్సరంలో నిర్వహించిన సర్వే ద్వారా జిల్లాలో 2,85,398 మంది వయోజనులైన నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందన్నారు. వారి నుండి అనకాపల్లి జిల్లాలో అక్షరాంధ్ర మొదటి విడతగా ఈ ఏడాది 89,944 మంది వయోజనులైన నిరక్షరాస్యులను తీసుకుని, వారందరిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖలైన డిఆర్డిఏ, డ్వామా, మెప్మా ద్వారా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రాబోయే మూడు సంవత్సరాలలో అనకాపల్లి జిల్లాని అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకునిరావాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం ఉల్లాస్ అక్షరాస్య కార్యక్రమాన్ని జిల్లాలో 24 మండలాల్లో నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలను గుర్తించి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో అందరిని అక్షరాస్యులుగా తయారు చేయడం జరిగిందని చెప్పారు. డిఆర్డిఏ శాఖ ద్వారా 50,000 మంది మహిళలకు, డ్వామా ద్వారా 31,339 మంది పురుషులకు, మెప్మా ద్వారా 8,605 మంది నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలో ఉన్న మహిళలకు, మొదటి విడతలో జిల్లాలో మొత్తం 89,944 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వయోజన విద్య శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా ఉప సంచాలకులు ఎస్ఎస్ వర్మ, జిల్లా సమన్వయ అధికారి చిన్నికృష్ణ, జెడ్పి సిఇఒ నారాయణమూర్తి, డిఇఒ జి.అప్పారావు నాయుడు, డిఆర్డిఏ, డ్వామా, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు శచీదేవి, పూర్ణిమా దేవి, ఎన్.సరోజిని, సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : 2023-24 సంవత్సరంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2023 - 2024 సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు 14 నెలలు అవుతున్నా నేటికీ ఆ బకాయిలను విడుదల చేయలేదన్నారు. దీంతో కాలేజీ యాజమాన్యాలు తల్లిదండ్రుల దగ్గర వసూలు చేస్తున్నాయన్నారు. కొత్త విద్య సంవత్సరం 2025- 26 ఫీజులు కూడా కాలేజీ యాజమాన్యం వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రుల, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం తక్షణమే ఈ బకాయిలను విడుదల చేయాలని కోరారు.


బుద్ధ రాజేష్

రైవాడ నీరు విడుదల

ప్రజాశక్తి-దేవరపల్లి : ఖరీఫ్ సాగుకు రైవాడ జలాశయ కుడి ఎడమ కాలువల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని జలాశయ చైర్మన్ పోతల పాత్రినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎరకలమ్మ గుడి వద్ద ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైవాడ జలాశయాన్ని 2026లో పూర్తిగా రైతులకు అంకితం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పైలా ప్రసాదరావు, ఇరిగేషన్ ఈఈ ఏ త్రినాధం, డిఈ సత్యం నాయుడు, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ నాయుడుబాబు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నీటి సంఘం ప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.


నీటి విడుదలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు బండారు, రాజు

నేరెళ్ల చెరువు గెడ్డ ఆక్రమణ పరిశీలన


ఆక్రమణ గురైన గెడ్డను పరిశీలిస్తున్న తహశీల్దారు తదితరులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం రెవిన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 74/4లో సుమారు 48.82 విస్తీర్ణం గల నేరెళ్ల చెరువు గెడ్డో వాగుల ఆక్రమణపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు తహశీల్దారు చిన్నికృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ చెరువు ఆయకట్టులో సుమారు 400 ఎకరాల వంట పొలాలు ఉన్నాయి. ఈ పంట పొలాలకు నీరు ప్రవహించడానికి వర్షపు నీరు చెరువులో ప్రవేశానికి చెరువునకు తూర్పు దిక్కున, పడమర దిక్కున గెడ్డ వాగులు ఉన్నాయి. పడమర వైపున సర్వే నెంబర్ 57లో ఉన్న గెడ్డ వాగును, తూర్పున సర్వే నెంబర్ 10లో ఉన్న సుమారు రెండు ఎకరాల 66 సెంట్లు గెడ్డ వాగును డెల్టా లే అవుట్ వారు ఆక్రమణ చేశారని, సర్వే నెంబర్ 66, 67లలో కూడా గెడ్డ వాగు ఆక్రమణకు గురైందని గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రెవిన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో ఈ నెల 28న పిజిఆర్ఎస్‌లో మళ్లీ రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చెరువును ఆక్రమణకు గురైన గెడ్డవాగులను, లే అవుట్‌ను పరిశీలించారు. దీనిపై గతంలో వీఆర్వో, ఆర్ఐలు దర్యాప్తు చేసి తప్పుడు నివేదికలు అధికారులకు పంపారని, లే అవుట్ యజమానికి అమ్ముడుపోయారని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి, తప్పుడు నివేదికలు ఇచ్చిన రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని అచ్చెర్ల పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి స్వప్న మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, నైనముశెట్టి భూషణం, పొన్నాడ జాన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : దుడ్డుపాలెం, గంధవరం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఈ.పావని ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ వరి నారుమడులు చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డుపాలెం, గంధవరం గ్రామాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస, లక్ష్మీపురం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి మాట్లాడుతూ, అన్న దాత సుఖీభవ పథకం కింద అర్హత పొందిన రైతులు బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్‌ను జత చేసుకోవాలని సూచించారు.

జల జీవన్ పనులు అస్తవ్యస్తం

-ఎక్కడా కూడా పూర్తి చేయలేదు-తాగునీటికి అవస్థలు
-ఏజెంట్లతోనే రెవెన్యూశాఖలో పనులు
-మండల సమావేశంలో సభ్యులు ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిడిఓ సీతారామరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు సమస్యలను ఏకరువు పెట్టారు. రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై మండిపడ్డారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇంటింటి కులాయిలు చుక్కనీరు విదల్చుకుండా, దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ముందుగా రెవెన్యూ డిటి నారాయణరావు మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ మేరకు న్యాయం పూడి ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు రెవిన్యూ అధికారుల పనితీరుపై, రెవిన్యూ వ్యవస్థ పై మండిపడ్డారు. రెవెన్యూ కార్యాలయంలో ఏజెంట్ ద్వారానే పనులవుతున్నాయే తప్పా, సామాన్య ప్రజానీకానికి రెవెన్యూ సేవలు అందడం లేదని ఆరోపించారు. డిఎల్ పురం ఎంపీటీసీ సభ్యులు కొండ్ర కనకారావు రెవెన్యూ అధికారుల పని తీరుపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవిన్యూ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని మండిపడ్డారు.

వేంపాడు పిఎసిఎస్ చైర్మన్ వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయుటకు సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. వేంపాడు



సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు మాట్లాడుతూ ఇప్పటివరకు సమావేశానికి రాని అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలన్నారు.ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్ గ్రామాల వారిగా చేపట్టిన జలజీవన్ పనుల గురించి వివరించారు. దీంతో పలువురు సభ్యులు ఆయనకు అడ్డు తగిలారు. జలజీవన్ మిషన్ పనులు ఎక్కడా పూర్తి కాలేదని సభ్యులు స్పష్టం చేశారు. చినదొడ్డిగల్లు గ్రామంలో జలజీవన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ వెలగా శ్రీనివాసరావు కోరారు. ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా రోడ్లు తవ్వేసి,పాడు చేశారన్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని, వెంటనే సరిచేసి తాగునీటిని అందించాలని కోరారు. కాగిత సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ గత 15 రోజుల నుండి తాగునీరు సరఫరా అవ్వకపోవడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

దీనిపై ఎంపీడీవో డి సీతారామరాజు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి అధికారులు, కాంట్రాక్టర్ తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామన్నారు. ఉద్దండ పురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ కు స్థలం కేటాయించాలని కోరారు. న్యాయంపూడి ఎంపీటీసీ సభ్యులు గోవిందరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లపై ఏం చర్యలు తీసుకుంటున్నారని డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావును ప్రశ్నించారు. న్యాయంపూడిలో అనధికార లే అవుట్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తలెత్తిన సమస్యలను హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్తామన్నారు. జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ,గొడిచెర్ల పిఎసిఎస్ చైర్మన్ దార్ల కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, బచ్చల రాజు తదితరులు సమస్యలపై మాట్లాడారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో అన్ని గ్రామాల్లోనూ ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో డి సీతారామరాజు అన్నారు. మండలంలో అమలాపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శి సత్యం కు సూచించారు. వాటర్ ట్యాంకును పరిశీలించి క్లోరోనేషన్ చేయించారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ

ప్రజాశక్తి- పాయకరావుపేట: పట్టంణంలోని వై జంక్షన్‌లో గల ప్రభుత్వ ఆసుపత్రికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాసరి నేస్తాలు, జయలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో సుమారు 20,000 రూపాయల విలువగల వాటర్ ప్యూరిఫైర్ ను మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ చేస్తున్న సేవలను డాక్టర్ సుభాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రెటరీ వాసు, కోశాధికారి ప్రదీప్, సభ్యులు కట్టమూరి నూకరాజు, దాసరి రాజ్ కుమార్, తాతాజీ, వెంకటేష్ , వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నేత చిరంజీవి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మాకవరపాలెం మండలం ఆశా కార్యకర్తల సమావేశంలో సిఐటియు నాయకులు ఈర్ల చిరంజీవి డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 26వేల వేతనాన్ని అందజేయాలన్నారు. రాజకీయ వేదింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నం: ఈనెల 31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కార్యాలయ మేనేజర్ రామకృష్ణ తెలిపారు, చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు సభ్యులంతా హాజరై సమస్యలను తీసుకురావాలని కోరారు.

స్వచ్ఛంద సేవా సంస్థల ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా సుబ్బలక్ష్మి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా స్వచ్ఛంద సేవాసంస్థల ఫోరం అధ్యక్షురాలుగా ఆయుర్జీవ సంస్థ వ్యవస్థాపకులు సుబ్బలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మంగళవారం జగదాంబ జంక్షన్‌లో సకల్య ఎన్‌జిఒ సహకారంతో సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, స్వాంతన సంస్థ ప్రతినిధి ప్రజ్ఞాన్ కుమార్, సిఫా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ నేతత్వంలో ఫోరం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా అప్ వరల్డ్ సంస్థ ప్రతినిధి డేవిడ్ రాజు, ప్రధాన కార్యదర్శిగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి రత్నం సహాయ కార్యదర్శిగా ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు విశాలాక్షి, కోశాధికారిగా ఆస్క్ ఫౌండేషన్ ప్రతినిధి ఎ.మునీర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముందుగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ సన్యాసినాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి స్వచ్ఛంద సేవా సంస్థలకు న్యాయ సలహాలు అందించారు.

దళిత రైతుల గోడు పట్టదా ?

ఏడో రోజుకు నిరసన దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీ రద్దు చేయాలని ఏడు రోజులుగా దళిత రైతులు నిరాహార దీక్షలు చేస్తుంటే స్పీకర్ అయ్యన్న పట్టించుకోరా అని ఎపీ బిఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బి. పరంజ్యోతి ప్రశ్నించారు. మంగళవారం దళిత రైతుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మాకవరపాలెం మండలం జి.కోడూరు, సుభద్రయ్యపాలెం గ్రామాల దళిత రైతులు రాళ్ల క్వారీని రద్దు చేయాలని ఏడు రోజులుగా నిరసన దీక్ష చేస్తుంటే దళిత రైతుల గోడు పట్టణం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే క్వారీని రద్దు చేయాలని పలు ఆందోళనలు చేసి క్వారీ రద్దు చేయించారని, ఇప్పుడు అధికారంలోకి రాగానే మళ్లీ కొత్తవారికి లీజుకు రావడంతో ఎందుకు మాట్లాడటం లేదన్నారు.ఏఐబిఎస్పి


నినాదాలు చేస్తున్న నాయకులు

రాష్ట్ర మహిళ సంఘం అధ్యక్షురాలు హేమేశ్వరి మాట్లాడుతూ క్వారీని రద్దు చేసేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర మహిళ కన్వీనర్ లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి బహుజన బొట్టా నాగరాజు, జిల్లా మహిళా సంఘం ఎన్.తులసి, కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి, కన్వీనర్ కొల్లు గంగాధర్, సూరిబాబు, అప్పారావు, పెంటయ్య, మారేసు, దేముడు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నందారపు, పుప్పాల

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల మండల టిడిపి అధ్యక్షునిగా నందారపు సన్యాసిరావు, కార్యదర్శిగా పుప్పాల రమేష్ ను ఎంపిక చేశారు. గతంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్ష పదవికి పలువురు అభ్యర్థులు పోటీ పడటంతో నియోజకవర్గ అబ్జర్వర్ ఏసుదాసు మండల నాయకులు నుండి అభిప్రాయాలు తీసుకోని అధిష్టానం దృష్టికి తీసుకోని వెళ్లారు.దీంతో ఒమ్మలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత పిఏసిఎస్ అధ్యక్షులు నందారపు సన్యాసిరావుకి అప్పగించారు. అలాగే మాడుగుల క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్ కి కార్యదర్శి పదవి అప్పగించారు. క్లస్టర్ -1 కు కోటపాడు గ్రామానికి


సన్యాసిరావు


రమేష్

చెందిన మజ్జి లక్ష్మణరావు, కో ఇంచార్జ్ గా భీశెట్టి విజయలక్ష్మి , క్లస్టర్ -3కు జెడి పేట గ్రామానికి చెందిన వడ్డి రాజ్కుమార్ ను నియమించారు.

బాక్సింగ్‌కు విశాఖ ప్రసిద్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాక్సింగ్ నిర్వహించడంలో, బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేయడంలో, రాష్ట్రంలోనే విశాఖ నగరానికి ఎంతో పేరు ఉందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ. వెంకటేశ్వరరావు అన్నారు.మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే బాక్సింగ్‌కు ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా, విశాఖ నగరానికి అదే ప్రాధాన్యత కొనసాగుతుందన్నారు. అండర్ 22 బాక్సింగ్ పోటీలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని, అయితే దీనికి శాఫ్ అనుమతి రావలసి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా మీడియాకు పరిచయం చేశారు. అధ్యక్షునిగా ఐ. వెంకటేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యక్షునిగా కె.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులుగా బి.ఎ లక్ష్మణ్‌దేవ్,దండు నాగేశ్వరరావు,ఎం. మన్మథకుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.మధుసూదనరావు, సంయుక్త కార్యదర్శులుగా జి.రమ్య, బి.సురేంద్రబాబు, సిహెచ్ చంద్రశేఖర్, వైవిఎస్ ఉమామహేశ్వరరావు, ఎస్.మహేష్‌కుమార్, డి.శివరామకృష్ణ, కోశాధికారిగా కె. శ్రీనివాసరావు, మరో నలుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


దాణా పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ:పాడి పశువులకు 50 శాతం సబ్సిడీపై దానాను ఎల్బీ పట్నం ఉప సర్పంచ్ కురచా నారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు జైతవరం గ్రామంలో పశువుల దాన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ, పాడి రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జైతవరం మాజీ సర్పంచ్ నాయుడు , సింగవరం పాల సంఘం అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న నాయకులు

క్వారీని పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మాకవరపాలెం మండలం జి కోడూరు వద్ద నల్ల రాయి క్వారీని బిఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్ పరంజ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్వారీ పేలుళ్లతో సమీప ప్రాంతాల రైతుల భూములు కలుషితం అవుతున్నాయన్నారు. అక్రమ క్వారీని రద్దు చేయాలని, రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సందర్భంగా ఆమె తెలిపారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చీడికాడ:ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం తురువోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్యాం కుమార్, ఎన్నిక నిర్వాహకులుగా ఉపాధ్యక్షులు దేముడుబాబు హాజరయ్యారు.గౌరవ అధ్యక్షులుగా లెక్కల ప్రసాద్‌రావు, అధ్యక్షులుగా జిపిఎ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా మండల ఫణి కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

-పారిశుధ్యం అధ్వానంపై సీరియస్- పని తీరు మారకుంటే చర్యలు

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండల శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు వడ్డాదిలోని పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీల నుండి మురుగునీరు ట్యాంకులలో కలిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డాది జంక్షన్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని, సేకరించిన చెత్తను పెద్దేరు నది పక్కన డంపింగ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో అక్కడే కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంపద తయారీ కేంద్రం నిర్వహణ, గ్రామంలో రోడ్డు పక్కన చెత్త డంపింగ్ చేయడం, తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖల అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రోడ్డు పక్కన చెత్త, ప్లాస్టిక్ కవర్లు కనిపించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రభుత్వ కార్యక్రమాలు డేటా ఎంట్రీ చేయకపోవడం, పనుల నిర్వహణలో అశ్రద్ధపై కలెక్టర్ మండిపడ్డారు.తాను వెళ్లిన రెండు గంటల్లోపు గ్రామంలో సర్వే నిర్వహించి పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నివేదిక సమర్పించాలని ఎంపీడీవో బానోజీరావు, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, కార్యదర్శి ఈశ్వరరావును ఆదేశించారు. తాను ముందస్తు సమాచారం ఇచ్చాకే వడ్డాది పర్యటనకు వచ్చానని, అయినప్పటికీ అధికారులు తమ శాఖల డేటా, రిజిస్టర్లు చూపించకపోవడంపై ఆగ్రహించారు. వచ్చే మంగళవారం వడ్డాది గ్రామానికి వస్తానని, ఈ లోపుగా అన్ని శాఖల అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకుని పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక పశు వైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట డిపిఓ సందీప్ కుమార్, డిఎల్పిసి నాగలక్ష్మి, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, మండల శాఖ అధికారులు ఉన్నారు.

మాడుగుల: పారిశుధ్య విషయంలో నిర్లక్ష్య వైఖరి వహిస్తే చర్యలు తప్పవని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలో ముకుందపురం గ్రామంలో పర్యటించిన ఆమె ఆర్ అండ్ బి రోడ్డు నుండి సచివాలయం వరకు నడుచుకుంటూ వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త సంపద కేంద్రాలు అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముకుందపురం సర్పంచ్ కర్రీ గణేష్ గ్రామంలోని దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని చెప్పారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ కే. రమాదేవి, డీపీఓ ఈ. సందీప్, జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి, ఏపీడీ బీ. శ్రీనివాస్, డీపీఆర్సీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి ఉన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బల్క్ డ్రగ్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆగస్టు 6వ తేదీన బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని వైసిపి నేత,కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, భూ పోరాట కమిటీ సభ్యులు తళ్ల భార్గవ్ కలిసి వినతిపత్రం అందజేశారు.మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలని కోరుతూ ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మకు మంగళవారం వినతిపత్రాన్ని ఇచ్చారు.కాకినాడ జిల్లా తొండంగి ప్రాంతంలో అక్కడ ప్రజలు బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకించారని, అటువంటి హానికరమైన పరిశ్రమను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు అనారోగ్య పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయకూడదని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెదుళ్లపాలెం సర్పంచ్ వెంకటరమణ, నాయకులు గోవిందరావు, గోవింద్ పాల్గొన్నారు.

31న ఇళ్ల ప్లాట్‌ల కేటాయింపునకు లాటరీ

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు ఈనెల 31వ తేదీన ఇంటి స్థలాలు కేటాయించేందుకు లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు నర్సీపట్నం ఆర్డిఓ, ఆర్ అండ్ ఆర్ అధికారి వివి రమణ ప్రకటనలో తెలిపారు. మండలంలో డి.ఎల్.పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాల్లో సేకరిం చిన భూములలో నివాస గృహములు కోల్పోయిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ నకు అర్హులుగా 745 లబ్దిదారులను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన కాగిత పాటిమీద కొత్త రోడ్ చివర చర్చి దగ్గర గుర్తించిన 745 మంది లబ్ధిదారులకు వారి సమక్షంలో లాటరీ ఎంపిక ద్వారా ప్లాట్లు కేటాయించడం జరుగు తుందన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ

డిఆర్‌డిఎ పీడీ పర్యటన

ప్రజాశక్తి -రావికమతం: అనకాపల్లి డి ఆర్ డి ఎ ప్రాజెక్టు డైరెక్టర్ సచీదేవి రావికమతం మండల, వెలుగు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక పింఛన్లు పంపిణీ సిబ్బందితో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సామాజిక పింఛన్లు పంపిణీ ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు జరుగుతున్నది, లేనిది ఆరా తీశారు. పెన్షన్లు పంపిణీలో ఎటువంటి అలసత్వం వహించడానికి వీలులేదని, నూటికి నూరు శాతం ఒకటవ తారీఖున పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చూడాలని ఆమె తెలిపారు. అనంతరం వెలుగు సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏపిఎం ఈశ్వరరావు, సి. సి కృష్ణ, శ్రీనిధి ఏజీఎం వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది

ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ



ఐద్వా కంచరపాలెం జోన్ మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి- మాధవధార : స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది అని, ఆ దిశగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ కోరారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కంచరపాలెం జోన్ కమిటీ మహాసభను బిఎన్ఆర్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఎం.జయలక్ష్మి, సిహెచ్.కమల అధ్యక్ష వర్గంగా జరిగిన కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు అమ్మలమ్మ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కాలంలో మృతిచెందిన ఐద్వా జోన్ కార్యదర్శి ఎ.పుష్పాంజలిసాహు చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకులు ఆర్.భాగ్యలక్ష్మి, వి.లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకలాపాల నివేదికను జోన్ అధ్యక్షులు కె.అనురాధ ప్రవేశపెట్టారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సనాతన ధర్మం పేరుతో మహిళలను రెండో స్థాయి పౌరులుగా భావిస్తూ పురుషాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మోడీతో స్నేహం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ పితృస్వామ్యాన్ని బలపరుస్తున్నారని, మూఢవిశ్వాసాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తి, సమానతా విలువలు మరుగున పడుతున్నాయన్నారు. బేటీ బచావో బేటీ పడావో వంటి నినాదాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని ఎద్దేవాచేశారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నా నిందితులను బహిరంగంగా సమర్థించే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. మద్యాన్ని ప్రభుత్వ పాడి ఆవుగా మార్చిందని, ఫలితంగా పిల్లలు, స్త్రీలు హింసకు గురవుతున్నారని తెలిపారు. మహిళల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పోర్న్ వీడియోల వ్యాపారం వేగంగా పెరుగుతున్నాయన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. బలమైన ఉద్యమం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టా ఈశ్వరమ్మ, ఒ.విజయ, కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా కంచరపాలెం జోన్ నూతన కమిటీనిర ఎనునకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కె.అనురాధ సిహెచ్.సుమిత్ర ఎన్నికయ్యారు. జోన్ కమిటీ సభ్యులుగా ఎం.జయలక్ష్మి, కె.హేమలత, ఎస్.ఆదిలక్ష్మి, బి.ఈశ్వరమ్మ, కె.పార్వతి, లీలావతి, ఎం.కల్యాణి, ఒ.విజయ, సిహెచ్.కమల, డి.పాపమ్మ డి.హేమలత, కె.చంద్రకళ, శోభ, సులోచన, యు.ఉమ, ఎస్.అమ్మలమ్మ ఎన్నికయ్యారు.

జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్ పోటీల్లో

విభిన్న ప్రతిభావంత విద్యార్థి బాల సరస్వతి సత్తా

ప్రజాశక్తి- రావికమతం: దివ్యాంగ విద్యార్థులు కూడా జాతీయస్థాయి ఆటల పోటీల్లో రాణించడం ఎంతో ఆనందదాయకమని మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు అన్నారు. ఈనెల 24 నుండి 28 వరకు చత్తీస్ గడ్ రాష్ట్రంలో బిలాస్ పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ బోసి బాల్ గేమ్ పోటీలలో అనకాపల్లి జిల్లా, రావికంతం మండలం కేబిపి అగ్రహారం గ్రామానికి చెందిన నక్కరాజు బాల సరస్వతి ఈ పోటీలలో పోరాడి నాల్గవ స్థానం దక్కించుకుందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు జాతీయస్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయి దివ్యాంగల బోసి బాల్ గేమ్ క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 8 మంది దివ్యాంగ బాల బాలికలు పాల్గొని ఆరు పథకాలను సంపాదించడం జరిగిందన్నారు. వీరిలో నక్కరాజు బాల సరస్వతి ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి బోసి గేమ్ వ్యక్తిగత విభాగంలో నాలుగో స్థానం దక్కించుకుందని తెలిపారు.ప్రత్యేక ఉపాధ్యాయులు బొడ్డు మహాలక్ష్మి నాయుడును, బాల సరస్వతిని రాష్ట్ర, జిల్లా, మండల, సమగ్ర శిక్ష విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



మెడల్, ప్రశంసాపత్రాలతో బాల సరస్వతి